# కథ

# ఇల్లు దొరికింది

డా.తంగిరాల మీరా సుబ్రమణ్యం

సిగరెట్టు మీద సిగరెట్టు కాల్చి పారేస్తున్నాడు చెయిన్లు.

చెప్పులతోపాటు కాళ్ళు కూడా అరిగిపోయాయి గాని ఇల్లు దొరకలేదు.

పెళ్ళిరోజు దగ్గర పడుతున్న కొద్దీ బి.పి. పెరిగిపోతూంది చెయిన్లుకు.

పెళ్ళి అతనికి కాదు. ఇల్లుగల వాళ్ళ అమ్మాయిది. అందుకే అల్టిమేటమ్ ఇచ్చారు. నెలరోజుల్లో ఇల్లు ఖాళీ చేయమని.

నెలలో ఇరవై రోజులు గడిచేపోయాయి. పదిరోజులనగా ఎంత?

ఆపద మొక్కుల వాడికి తలనీలాలిస్తానని మ్రొక్కుకున్నాడు కూడా. ఆ మహానగరంలో ఇల్లు దొరికేట్టు చేయగల ఇన్ఫ్లూఎన్స్ ఆ ఏడుకొండలవాడికి కూడా లేనట్టుంది.

ఆంధ్రదేశంలో ఆడపిల్లకు కట్నం లేకుండా పెళ్ళి కావచ్చు, అగ్రకులంలో పుట్టిన అభాగ్యుడికి మొదటి ఇంటర్వ్యూలోనే సెలక్షన్ రావచ్చును గాక, గవర్నమెంటు డాక్టరుగారు డబ్బు తీసుకోకుండా వైద్యం చేసినా చేయవచ్చును గాక గానీ ఆ ఊళ్ళో అంత త్వరగా ఇల్లు దొరకడం మాత్రం జరగదనే నిర్ణయానికి వచ్చేసాడు చెయిన్లు.

కడుపులో ఆకలిరాముడు కేకలు పెట్టేసరికి, సిగరెట్టు విసిరేసి పాక శాస్త్రాన్ని ఓ పట్టు పట్టే ప్రయత్నంలో పడ్డాడు ఇంటివాడు కావాలనుకుంటున్న ఆ ఒంటరి సొంఠి కొమ్ము.

అసలే కోపం మీదున్నాడేమో అపరభీముడై విజృంభించి గరిట తిప్పేడు. బంగాళ దుంపల వేపుడు, వంకాయ పెరుగు పచ్చడీ, బీరకాయ పప్పు, టమోటా చారు గబగబ ముస్తాబైపోయాయి. కొసమెరుపుగా నాలుగు అప్పడాలు వేయించి పెట్టుకుని భోజనానికి కూర్చున్నాడు తెలుగుతల్లి ముద్దుబిడ్డడు. గోంగూర పచ్చడి లేదే అని రవ్వంత విచారించాడు.

ఇంటివాళ్ళ మీద కోపం, ఇల్లు దొరకని అసహాయతలతో బాటు మూడేళ్ళ అనుభవం కారణంగా పాకశాస్త్ర ప్రావీణ్యం కూడా తోడుకావడంతో గంటన్నర కష్టపడి వండినవన్నీ పదిహేను నిమిషాల్లో లాగించేసాడు చెయిన్లు.

భుక్తాయాసంతో పేపరు చేతబట్టి మంచమెక్కాడు. నిద్రరావడం కోసం హిందులో అడ్వర్‌టెయిజ్‌మెంటు పేజీని సిరియస్‌గా చదువుతుండగా ఒక వింత జరిగింది.

నిద్ర బరువుతో సోలిపోతున్న అతని కళ్ళు ఫెవికాల్ వేసి అతికించినట్టు ఒక ప్రకటన మీద అతుక్కుపోయాయి. ఎలాగో అవస్థపడి రెప్పవేసి మళ్ళీ చదివేడు ఆ ప్రకటన.

"హుర్రే" అంటూ ఒక్కకేక పెట్టి మంచం మీద నుండి లాంగ్‌జంప్ చేసి అద్దం ముందుకు వెళ్ళిపడ్డాడు చెయిన్లు. స్నానం అయ్యాక వెంటనే బట్టలు కట్టేసుకున్నాడు గానీ లేకపోతే పెద్ద సైంటిస్టు కొచ్చినంత పేరు వొచ్చేది అతగాడి డిస్కవరీకి.

బంగారు ఛాయలో వున్న ముఖం మీద తుమ్మెద రెక్కల్లా పెరిగిన చిరుగడ్డం నువ్వు చెయిన్లువు కాదు ఎవరో పంజాబీవి పొమ్మంది.

'అదే నా షీలాకు కావల్సింది' అనుకుంటూ మల్లెపూవు లాంటి లాల్చీ పైజామా వేసి పెళ్ళికొడుకులా తయారై పోయాడు.

'నన్ను నమ్మి చెడినవాడు లేదు' అంటూ అభయమిచ్చి ఆశీర్వదించాడు గోడమీది ఏడుకొండలవాడు.

బస్సుల కోసం కాచుకోక టాక్సీ ఎక్కి అరగంటలో కావల్సిన అడ్రస్‌కు చేరాడు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఇంటి ముందే అదృష్ట దేవతలా దర్శన మిచ్చింది. 'షీలా' నేమ్ ప్లేట్.

ఇంటి అందం చూసి సగం మతిపోగొట్టుకున్న చెయిన్లు, కాలింగ్ బెల్లు పిలుపు విని తలుపు తీసిన సుందరాంగిని చూసి పూర్తిగా చిత్తైపోయాడు.

○ ○ ○

రెండు టెలిగ్రాంలు అందుకుని అగ్గి మీది గుగ్గిలంలా మండిపడి పోయారు పెద్ద చెయిన్లుగారు.

అటువంటి కుమార రత్నాన్ని కన్న తల్లీ, తన భార్యా అయిన ఇల్లాలిని అటు ఏడుతరాలు ఇటు ఏడుతరాలు దులిపి అలిసిపోయి "ప్రయాణమై అఘోరించు" అని కసిరేరు ఫైనల్‌గా.

అబ్బాయి ఇల్లు మారేనని రాస్తే ఈ కథాకేళి ఎందుకో అర్థం కాలేదా అమాయకపు ఇల్లాలికి.

రెండో టెలిగ్రాం ఏమిటో ఆవిడకు వివరించలేదు పెద్ద చెయిన్లుగారు.

ఆవకాయ నిమ్మకాయా, అప్పడాలూ, ఒడియాలు, అబ్బాయికి ఇష్టమైన గోంగూర పచ్చడీ మురిపెంగా సీసాల్లోకి నింపి సిద్ధమైంది మాతృమూర్తి.

"పిచ్చినాయనా! ఎన్నాళ్ళిలా చెయ్యి కాల్చుకుంటాడు? తొందరగా పెళ్ళి చేసేయండి వాడికి" అంటూ సుద్దులు చెప్తున్న భార్యామణిని జాలి జాలిగా చూసేరు చెయిన్లుగారు. తాము వస్తున్నట్టు ముందుగా చెప్పలేదు గనుక అడ్రస్ వెదుక్కుని ఇల్లు చేరారు ఇద్దరూ. "ఇల్లు మారితే మారాడు గాని మంచి ఇల్లే దొరికిందండీ" అంటూ ముచ్చటపడిపోయిందావిడ టాక్సీనుండి దిగగానే.

కాలింగ్ బెల్ మ్రోగేసరికి చేతిలో గరిటతో సహా వంటింట్లో నుండి పరిగెత్తుకు వచ్చాడు చెయిన్లు.


అమ్మను, నాన్నను చూడగానే ఒక క్షణం కంగారు పడినా అంతలోనే సర్దుకున్నాడు.

అతని వెనకాలే వచ్చిన పంజాబీ డ్రెస్‌లో వున్న బాబ్డ్ హెయిర్ అమ్మాయినీ, ఆ అమ్మాయి చేతిలోని మూడేళ్ళ బాబును చూస్తూ నిలబడిపోయింది చెయిన్లు వాళ్ళమ్మ. చెయిన్లు నాన్నగారు మాత్రం నిలబడలేనట్లుగా కుర్చీలో కూలబడ్డారు. చెయిన్లు హిందీలో ఏదో చెప్పగానే తన కాళ్ళకు వంగి నమస్కరిస్తున్న ఆ అమ్మాయి తలమీద ఆశీర్వాదపూర్వకంగా చెయ్యివుంచుతూ, అర్థం కానట్టు కొడుకు వైపు చూసింది చెయిన్లు తల్లి.

"షీలాను పెళ్ళి చేసుకున్నానమ్మా, ఆ బాబు ఆమె కొడుకు. బాబు పుట్టగానే ఆమె మొదటి భర్త హార్ట్ ఎటాక్‌తో పోయాట్ట. ఈ ఇల్లు ఆయనదే. ఈవిడ పేరట కొన్నాడు" నిదానంగా చెప్పాడు చెయిన్లు.

నోట మాటరానట్టుగా భర్త పక్కన మరో కుర్చీలో కూలబడింది తల్లి.

అణకువగల కోడలిలా అత్తగారికీ, మామగారికి



మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది షీలా. పెళ్ళికొడుకు, తండ్రీ, ఇంటివాడూ ఒకేసారి అయిపోయిన కొడుకు వైపు చూస్తూ చెరో చెంబుడు నీళ్ళు త్రాగేసారు ఆ వృద్ధ దంపతులు.

షీలాకు తెలుగు బొత్తిగా రాదని అర్ధం చేసుకున్న పెద్ద చెయిన్లుగారు నవ్వుతూ కొడుకుతో అన్నారు. "ఏరా అప్రాచ్యపు వెధవా? మేము చచ్చామనుకున్నావా? లేక లోకంలో కన్యలే లేకుండా గొడ్డు పోయిందనుకున్నావురా చవటా? పైగా ఘనకార్యం చేసినట్టు మురిసిపోతున్నావూ"?

మామగారు నవ్వడం చూచి తనూ నవ్వు ముఖంతో భర్తవైపు చూసింది షీలా.

షీలా వైపు చూసి నవ్వి తండ్రి కేసి చూస్తూ చిరునవ్వుతో చెప్పాడు చెయిన్లు "మన ఆంధ్రదేశంలో కన్యలకేం కొదవలేదని తెల్సు నాన్నా. అయితే ఈ ఊళ్ళో ఇళ్ళకు మాత్రం చాలా గిరాకీ. లక్షల్లో పగిడీలు కట్టాలి. అదివరకు వున్న ఇల్లు ఏదో రెకమెండేషను వల్ల దొరికింది. ఆ ఇంట్లో ముసలావిడ పెళ్ళి కాబోతున్న మనవరాలి ఫామిలీ డూయింగ్‌కు ప్రైవసీ వుండదని తెగ బాధపడి నా చెవిలో ఇల్లు కట్టుకొని జోరీగలా పోరుబెట్టింది ఖాళీ చెయ్యాలని. అసలు అద్దెకు ఇల్లు దొరకడమే కష్టం. దానికీ పగిడీ కట్టమన్నది నాకు తలకు మించిన భారం. అనుకోకుండా అన్నీ కలిసి రావడం జరిగి, ఈ అవకాశం వదులు కుంటే నా అంత చవట వుండబోడని ధైర్యం చేసాను. అయాం హ్యాపీ" అనేసి షీలా వైపు చూసి కన్నుగీటాడు.'

"అతను చెప్పింది నిజం" అన్నట్టు అత్తగారి వైపు మామగారి వైపు చూసి నవ్వింది షీలా.

"పోనీలెండి వాడొక ఇంటివాడై సుఖంగా వుండటమేగా మనకు కావల్సింది" అమాయకంగా నవ్వుతున్న షీలావైపు చూస్తూ 'కోడలు మంచిదానిలాగే వుంది' అనుకుంటూ భర్తకు సర్దిచెప్పింది చెయిన్లు తల్లి.

"కాస్త రెస్ట్ తీసుకోవే అమ్మా కూర దించేసి వస్తాను. షీలాకు మన భాష రానట్టే వంట కూడా రాదు. అందుకని ప్రస్తుతానికి నేనే వండుతున్నా" కులాసాగా ఈలవేస్తూ, చేతిలో వున్న గరిటను గదలాగా తిప్పుతూ వంటగదివైపు పరుగుతీసాడు చెయిన్లు.

పెళ్లైనా చెయ్యి కాల్చుకోవడం తప్పని కొడుకు వైపు జాలిగా చూసింది చెయిన్లు తల్లి.

ఖరీదైన సోఫామీద బాసింబట్టు వేసుకుని రెండు చేతులు నెత్తిమీద పెట్టుకుని కూర్చుని కళ్ళు మూసుకున్నాడు చెయిన్లు తండ్రి.

పాపం అలసిపోయినట్టున్నారు అనుకుంటూ లోపలికి వెళ్ళి చల్లటి షర్బత్ తెచ్చి ఇద్దరికీ అందించింది షీలా.

లోపలి నుంచి గుత్తి వంకాయ కూర ఘుమఘుమలతో బాటు చెయిన్లు పాట కూడా హాల్లోకి తేలి వస్తోంది "ఇల్లు చూసుకుని పెళ్ళి చేసుకుని చల్లగ కాలం గడపాలోయ్ మీరెల్లరు సుఖముగా వుండాలోయ్" అంటూ.